ప్రజాశక్తి
గురువారం 9 నవంబర్ 2023 5 అనంతపురం

అర్జీదారుడి సమస్యను అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ గౌతమి

జగనన్నకు చెబుదాంలో సమస్యల వెల్లువ

ప్రజాశక్తి-నార్పల

మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో జగనన్నకు చెబుదాం మండల స్థాయి కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సమస్యలపై కలెక్టర్‌కు అర్జీలు అందజేశారు. జెడ్పీ వైస్ ఛైర్మన్ నాగరత్నమ్మ, మేజర్ పంచాయతీ సర్పంచి సుప్రియలు మండల కేంద్రంలో మురుగునీరు, విద్యుత్ సమస్యలపై అర్జీని అందజేశారు. స్పందించిన కలెక్టర్ తాను నార్పలకు వచ్చే సమయంలో పరిస్థితిని చూశానని, కూతలేరు వంతెన వద్ద తీవ్రమైన దుర్గంధం వెదజల్లుతోందన్నారు. దుమ్ముధూళితో చాలా ఇబ్బందికరంగా ఉందన్నారు. సాధ్యమైనంత వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కషి చేస్తామని హామీ ఇచ్చారు. మండల కేంద్రమైన నార్పల ఉయ్యాలకుంటలో మసీదు కట్ట, సిపిఐ కాలనీ తదితర ప్రాంతాల్లో కరెంటు స్తంభాలు లేక కట్టెలపైనే విద్యుత్ కనెక్షన్లను ఇచ్చారన్నారు. బండ్లపల్లి గ్రామంలో పంచాయతీ మోటార్లు కాలిపోయి గ్రామ ప్రజలకు నీటి సమస్య ఎక్కువగా ఉందన్నారు. నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని సర్పంచి వెంకటనారాయణమ్మ అర్జీ ఇచ్చారు. రాష్ట్రంలోనే ప్రసిద్ధిగాంచిన కుళ్లాయి స్వామి వెలసిన గూగుడు గ్రామంలో సరైన డ్రెయినేజీ వ్యవస్థ లేదని, విశ్రాంతిభవనాలు కూడా లేవని గూగూడు సర్పంచి రమణ కుమారి శివయ్య కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. పూర్తి స్థాయిలో మరుగునీటి కాలువలు ఏర్పాటు చేసి, విశ్రాంతిబవనాలు నిర్మించాలని, కుళ్లాయి స్వామి ఆలయం వరకు రోడ్డును వెడల్పు చేయాలని కలెక్టర్‌కు అర్జీ ఇచ్చారు. నార్పల పశువైద్యశాలలో నెలకొన్న మందుల కొరతను తీర్చాలని పాడి రైతులు అర్జీలు ఇచ్చారు. ఈ విషయంపై కలెక్టర్ పక్కనే ఉన్న పశు వైద్యశాలను పశుసంవర్ధక శాఖ జెడితో మాట్లాడారు. వర్షాభావంతో తీవ్ర కరువు నెలకొన్న నేపథ్యంలో అన్ని గ్రామాల్లో అదనంగా మరో వంద రోజులు ఉపాధి పనులు కల్పించాలని రైతుసంఘం నాయకులు కోరారు. ఇళ్ల పట్టాలు, భూ సమస్యలపై పలువురు అర్జీలను అందించారు. భోజనం అనంతరం కలెక్టర్ జిల్లా, మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు.

నేరాల నియంత్రణకు చర్యలు : ఎస్పీ

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

జిల్లాలో నేరాల నియంత్రణపై ఎప్పటికప్పుడు పటిష్ట చర్యలు తీసుకోవాలని ఎస్పీ అన్బురాజన్ డీఎస్పీలకు సూచించారు. జిల్లాలోని డీఎస్పీలతో బుధవారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఛీటింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వీటిపై దర్యాప్తు పూర్తిచేసి ఛార్జిషీటు వేసి కోర్టుల్లో నెంబర్లు తీసుకోవాలని సూచించారు. రౌడీషీటర్ల కదలికలపై నిఘా ఉంచాలన్నారు. గత ఎన్నికల సమయంలో నమోదైన కేసుల్లో ఏవైనా పూర్తి కాకుండా ఉంటే వెంటనే వాటి దర్యాప్తును పూర్తి చేయాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలన్నారు. దొంగతనాల కేసులను ప్రాధాన్యతగా తీసుకుని ఛేదించడంతో పాటు రికవరీలు కూడా పెంచాలన్నారు. ఈ సమావేశంలో డీఎస్పీలు సిఎం గంగయ్య, యు.నరసింగప్ప, జి.ప్రసాదరెడ్డి, బివి.శివారెడ్డి పాల్గొన్నారు.

గ్రాఫ్ పెరిగిందా..?

- టిడిపిలో కొనసాగుతున్న సర్వేలు
- అభ్యర్థులు, పార్టీ పరిస్థితిపై వేరువేరుగా సర్వేలు

తెలుగుదేశం పార్టీ పరిస్థితి ఏ రకంగా ఉందన్న దానిపై అంచనాకు సర్వే బృందాలు దిగాయి. జనంలో పార్టీ గ్రాఫ్ ఏ రకంగా ఉందన్నది ఈ బృందాలు పరిశీలిస్తున్నాయి. ఉమ్మడి అనంతపురం జిల్లాలో వేరువేరుగా సర్వేలు కొనసాగుతున్నాయి. ఈ సర్వేల్లో ఏ రకంగా తమ పరిస్థితి ఉందన్నది గుబులు నేతల్లోనూ నెలకొంది. కొంతమంది నేతలు సర్వే బృందాలను ఏ రకంగా ప్రసన్నం చేసుకునే పనిలోనూ ఉన్నట్టు పార్టీ వర్గాల్లోనే చర్చ నడుస్తోంది.

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

తెలుగుదేశం పార్టీకి మంచి పట్టున్న జిల్లాల్లో ఉమ్మడి అనంతపురం జిల్లా ఉంది. 2019 ఎన్నికల్లో గతంలో ఎన్నడూలేనంతగా దెబ్బతింది. 14 నియోజకవర్గాల్లో 12 స్థానల్లో ఓటమి చెందింది. రెండు పార్లమెంటు స్థానాలనూ కోల్పోయింది. ఆ తరువాత జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ ఎదురు గాలే వీచింది. తాడిపత్రి పురపాలక సంఘం మినహా అన్ని మున్సిపాలిటీల్లోనూ ఓటమి చెందింది. గతంలో ఎన్నడూ ఇంతటి ఘోర ఓటమిని తెలుగుదేశం పార్టీ జిల్లాలో చవి చూడలేదు. ఒక రకంగా పార్టీ శ్రేణులు సైతం నైరాశ్యంలోకి వెళ్లాయి. ఇటువంటి తరుణంలో త్వరలో సార్వత్రిక ఎన్నికలు రానున్నాయి. కొన్ని నెలల్లో ఎన్నికలూ జరగనున్నాయి. ఇప్పుడు పార్టీ పరిస్థితి ఏ రకంగా ఉందన్న అంచనాలను వేసుకునే పనిలో ఆ పార్టీ అధిష్టానం పడింది. టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు జైలుకెళ్లి వచ్చాక ఏమైనా గ్రాఫ్ పెరిగిందా..? లేదా..? అన్నది కూడా అంచనా వేస్తున్నారు. ప్రధానంగా మూడు బృందాలు జిల్లాలో సర్వేలు చేపట్టినట్టు సమాచారం. అందులో ఒకటి పార్టీ కార్యక్రమాలపై దృష్టి పెట్టగా మరొకటి ప్రజల్లో పార్టీ పరిస్థితి ఏరకంగా ఉందన్నది సర్వేల ద్వారా అంచనా వేస్తోంది. మరొకటి నేతలెవరైతే బాగుంటుందన్నది పరిశీలిస్తోంది. ఇప్పుడున్న నాయకుల పరిస్థితి ఏ రకంగా ఉంది. ..కొత్తగా ఎవరైనా అవుత్సాహికులున్నారా అన్నది కూడా పరిశీలిస్తున్నారు. కొత్త వారైతే వారి ఆర్థిక స్థితిగతులేమిటన్నది కూడా అంచనా వేసే పనిలోనున్నారు. సామాజిక తరగతుల వారీగానూ ఈ అధ్యయనం సాగుతోంది. ఈ రకమైన సర్వేలు నడుస్తున్న సమయంలో ఉన్న నేతలు తమ పట్టును నిరూపించుకునేందుకు సర్వే బృందాలను గుర్తించి వారి ద్వారా అనుకూలమైన నివేదికలను అధిష్టానానికి అందించే విధంగా చూసుకునే పనిలోనూ ఉంటున్నారన్న ఆరోపణలూ ఉన్నాయి. ఇంకో వైపు అధికార వైసిపి కూడా తమ బలబలాతోపాటు, ప్రతిపక్ష పార్టీ బలహీనతలపైనా దృష్టి పెడుతోంది. ఆ పార్టీ కూడా ప్రభుత్వ, ప్రయివేటు సర్వేలను నిరంతరాయంగా చేపడుతోంది. ఈ నేపథ్యంలో రాబోయే రోజుల్లో రాజకీయాలు మరింత రసవత్తరంగా సాగనున్నాయి. టిడిపి కూడా సర్వేల ద్వారా అభ్యర్థుల ఎంపికలను చేపట్టనుంది. గతంలోలాగా నేతల ఒత్తిళ్లపై కాకుండా సర్వేలపై ఆధారపడి ముందుకెళ్లే పరిస్థితి నెలకొనడంతో ఇప్పుడున్న నేతలు తిరిగి టిక్కెట్టును నిలబెట్టుకునేందుకు పావులు కదుపుతుండగా, కొత్త వారు కూడా తమ ఆర్థిక బలాన్ని చూపించి టిక్కెట్టును సాధించేందుకు సిద్ధమవుతున్నారు. కొత్త, పాతల మధ్య పోటీ సైతం నెలకొంటోంది. సర్వేల నివేదికల ద్వారా అధిష్టానం ఎటువంటి అడుగులు వేస్తుందన్నది చూడాల్సి ఉంది. ఏది ఏమైనా టిడిపిలోనూ అప్పుడే ఎన్నికల కసరత్తు ఊపందుకుంటోంది. నేతల్లో కదలిక ఊపందుకుంటోంది.

విద్యాసంస్థల బంద్ విజయవంతం

బంద్ సందర్భంగా అనంతపురంలో నిరసన తెలుపుతున్న ఐక్య విద్యార్థి సంఘం నాయకులు

విశాఖ ఉక్కు ప్రయివేటీకరణను ఆపాలని, కడపలో ఉక్కు పరిశ్రమను ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన విద్యా సంస్థల బంద్ జిల్లా వ్యాప్తంగా విజయవంతం అయ్యింది. అన్ని ప్రయివేటు విద్యాసంస్థలను మూసి వేసి బంద్‌కు సహకరించారు. ప్రభుత్వ పాఠశాలలు సైతం మూతబడ్డాయి. ఆయా ప్రాంతాల్లో విద్యార్థులతో కలిసి ర్యాలీలు చేశారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అంటూ ర్యాలీల్లో నినదించారు. కేంద్ర ప్రభుత్వం విశాఖను ప్రయివేటీకరించాలని చూస్తే పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా విశాఖ ఉక్కు ప్రయివేటీకరణ చేయకుండా కేంద్రంపై పోరాటం సాగించాలని విద్యార్థి సంఘాల నాయకులు తెలియజేశారు.

వార్త 6లో

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు విఫలం

సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

ప్రజాశక్తి-కళ్యాణదుర్గర్,ఆత్మకూరు, బెలుగుప్ప

ప్రజా, రైతు, కార్మిక సమస్యల పరిష్కారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలం అయ్యాయని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ విమర్శించారు. వెనుకబడిన అనంతపురం జిల్లా సమగ్రాభివృద్ధి కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజారక్షణ భేరి స్కూటర్‌యాత్ర బుధవారం 3వ రోజు పలు మండలాల్లో కొనసాగింది. కళ్యాణదుర్గం, ఆత్మకూరు, కూడేరు, బెళుగుప్ప, గార్లదిన్నె, రాప్తాడు మీదుగా రాత్రికి అనంతపురం చేరుకుంది. ఆత్మకూరులో నిర్వహించిన కార్యక్రమంలో రాంభూపాల్ మాట్లాడుతూ జిల్లాలో సాగునీటి వనరులు కల్పించడంలో పాలకులు పూర్తిగా విఫలం అయ్యారన్నారు. తుంగభద్ర హెచ్ఎల్‌సి కాలువల కింద నిర్ణయించిన ఆయకట్టు భూములకు ఇప్పటివరకు పూర్తి స్థాయిలో నీరు అందించకుండా ప్రజా ప్రతినిధులు కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. రాప్తాడు నియోజకవర్గంలో 2019 సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా లక్ష ఎకరాలకు సాగును ఇస్తామని ఇచ్చిన హామీలు నేటికీ అమలుకు నోచుకోలేదన్నారు. రైతులు పండించిన పంటలకు మార్కెట్ సౌకర్యం లేదన్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు లేవన్నారు. పరిశ్రమలు ఏర్పాటు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలం అయ్యిందన్నారు. వర్షాభావంతో పంటలను పూర్తిగా నష్టపోతే ఆదుకోవాల్సిన ప్రభుత్వం పట్టించుకోకపోవడం విచాకరం అన్నారు. కరువు సహాయక చర్యలు చేపట్టి ఎకరాకు రూ.50 వేల పంట నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉపాధి పనులను 200 రోజులకు పెంచి రోజుకు 600 రూపాయల కూలి ఇవ్వాలన్నారు. డ్రిప్, స్ప్రింక్లర్లను 90 శాతం సబ్సిడీతో ఇవ్వాలన్నారు. భూమి లేని నిరుపేదలకు రెండు ఎకరాల సాగుభూమి ఇవ్వాలని కోరారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చి వారికి పంట రుణం, పంట నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ పంప్ సెట్లకు మీటర్లు బిగించే విధానాన్ని తక్షణం విరమించుకోవాలన్నారు. పంటలు పూర్తయ్యేవరకు హంద్రీనీవా, కాలవల ద్వారా రైతులకు సాగునీరు ఇవ్వాలన్నారు. పరిశ్రమలను ఏర్పాటు చేసి యువతకు ఉపాధి అవకాశాల కల్పించాలన్నారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులకు భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయాలన్నారు. వీటితో పాటు ప్రజా సమస్యల పరిష్కారం కోరుతూ నవంబర్ 15న చలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇందులో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి సభ్యులు బాలరంగయ్య, జిల్లా కమిటీ సభ్యులు ఎస్.నాగేంద్రకుమార్, చంద్రశేఖర్‌రెడ్డి, కృష్ణమూర్తి, రంగారెడ్డి, నాగమణి, అచ్యుత్‌ప్రసాద్, మద్రి చెన్నారెడ్డి, ఎస్ఎఫ్ఐ శివ, సిఐటియు నాయకులు భీమన్న, పాతన్న, మారెన్న, నరసింహులు, ముత్యాలరెడ్డి, వెంకటేశులు, ఆత్మకూరు మండల కార్యదర్శి శివ శంకర్, మధ్యాహ్నం భోజనం జిల్లా సహాయ కార్యదర్శి జయమ్మ, ఆత్మకూరు రైతు సంఘం మండల కార్యదర్శి రాము, ఆవాజ్ మండల కార్యదర్శి వలీ, ఐద్వా మండల కార్యదర్శి రాజేశ్వరమ్మ, వెంకటమ్మ, కళ్యానదుర్గం నాయకులు నాగమణి, రఘు, రంగనాథ్, భవిత, సిద్దప్ప, అశోక్, నాగరాజు, ఈశ్వర్, కార్తీక్, వంశీ, దనుష్ పాల్గొన్నారు.

బెలుగుప్పలో స్కూటర్ యాత్రలో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

పేదల ఇళ్లు కూలుస్తున్నా స్పందించరా..?

గార్లదిన్నె : నిరుపేదల ఇళ్లు కూలుస్తున్నా జిల్లాలో ఎమ్మెల్యేలు ఎంపీలు స్పందించారని రాంభూపాల్ ప్రశ్నించారు. గార్లదిన్నెలో జరిగిన స్కూటర్‌యాత్రలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎమ్మెల్యేలకు భూకబ్జాలు, ప్రభుత్వ భూమి కొల్లగొట్టుటపై ఉన్న శ్రద్ధ ప్రజలు, రైతులు, కార్మిక సమస్యల పరిష్కారంపై లేదన్నారు. ప్రజా, రైతు, కార్మిక సమస్యల పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. గార్లదిన్నె మండలంలో పేద నిరుపేద రైతులు ఎకరం, అరెకరం భూమిని సాగు చేసుకుంటే వాటికి పట్టాలు ఇవ్వని అధికారులు, అధికార పార్టీ నాయకులు ఎకరాలకు ఎకరాలు ఆక్రమించుకుంటే వాటికి పట్టాల మంజూరు చేస్తున్నారని తెలిపారు. అధికార పార్టీ నాయకులు మండల కేంద్రంలోని 456 సర్వే నెంబర్‌లో ఆరు ఎకరాల భూమిని బినామీ పేర్లు ద్వారా తప్పుడు డాక్యుమెంట్ల సష్టించి కాజేసారన్నారు. దీనిపై చర్యలు తీసుకోమని ఆర్డీవో ఉన్నతాధికారులకు సిఫారసు చేయగా ఆర్డీవోను నిర్దాక్షిణ్యంగా బదిలీ చేశారన్నారు. కల్లూరు గ్రామంలో పేదలు నిర్మించుకున్న 150 గుడిసెలను మానవత్వం మరిచి కూల్చేసారన్నారు. అదే సర్వే నెంబర్లో అధికార పార్టీ నాయకులు కట్టుకున్న ఇళ్లను అలాగే ఉంచారన్నారు. ప్రభుత్వం పేదల పక్షమో కబ్జాదారుల పక్షమో అర్థం కాని పరిస్థితి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు తరిమెల నాగరాజు, సిపిఎం మండల కార్యదర్శి మండల కార్యదర్శి చెన్నారెడ్డి, నల్లప్ప, నాగేంద్ర, చంద్రశేఖర్ రెడ్డి, నాగమ్మ, రాముడు, మల్లికార్జున పాల్గొన్నారు.

బిజెపి విధానాలకు వ్యతిరేకంగా పోరాడుదాం

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలు అనుసరిస్తున్న బిజెపికి వ్యతిరేకంగా పోరాడుదామని సిపిఎం నగర 1వ కమిటీ కార్యదర్శి వి.రామిరెడ్డి తెలిపారు. బుధవారం నాడు సిపిఎం ఆధ్వర్యంలో ప్రజా రక్షణభేరి కార్యక్రమంలో భాగంగా ఆర్‌టిసి బస్టాండ్, శ్రీకంఠం సర్కిల్ తదితర ప్రాంతాల్లో కరపత్రాలు పంపిణి చేశారు. ఈ నెల 15వ తేదీన విజయవాడలో నిర్వహిస్తున్న బహిరంగ సభకు ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సందర్భంగా సిపిఎం నగర 1వ కమిటీ కార్యదర్శి రామిరెడ్డి, సిఐటియు నగర కార్యదర్శి వెంకటనారాయణ మాట్లాడుతూ రాష్ట్రానికి అన్ని విధాలా బిజెపి ప్రభుత్వం అన్యాయం చేసిందన్నారు. రాష్ట్రానికి ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలు చేయకపోగా కార్పొరేట్ కంపెనీలకు రాష్ట్ర సంపాదన దోచి పెడుతుందని విమర్శించారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం, ప్రతిపక్షం పార్టీలు తెలుగుదేశం, జనసేన పార్టీలు నరేంద్ర మోడీకి భజన చేస్తున్నాయని విమర్శించారు. రాష్ట్రానికి రావాల్సిన హక్కుల కోసం పోరాడుదామని ప్రజలంతా భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర నాయకులు ఎన్టీఆర్ శీన, ఆటో యూనియన్ నాయకులు నాగరాజు, శివ, బంగారు నాగరాజు, మురళి, భవాని శీన, ప్రసాద్, నిజాం, బాషా, నందమూరి శీన, బుడ్డప్ప నగర్ భాషా, ఠాగూర్ తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలు పంపిణీ చేస్తున్న సిపిఎం నాయకులు

బికెఎస్ వైసిపిలో భగ్గుమన్న విభేదాలు

ఎంపిపి పదవికోసం మండల సర్వసభ్య సమావేశంలో నిరసన



మండల సర్వసభ్య సమావేశంలో కిందకూర్చొని నిరసన తెలుపుతున్న కాలవ వెంకటలక్ష్మి

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

బుక్కరాయసముద్రం అధికార వైసిపిలో విభేదాలు మరోసారి భగ్గుమన్నాయి. గత కొంతకాలంగా ఎంపిపి మార్పుపై ఆ ఆపార్టీ నాయకుల్లో విభేదాలు పొడచూపాయి. ఇందులో భాగంగా బుధవారం ఉదయం ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఎంపికి పదవి కోసం నిరసన వ్యక్తం అయ్యింది. ఎంపిపి దాసరి సునీత ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరి సాంబశివారెడ్డి హాజరయ్యారు. ఈ సమయంలో ఎంపీటీసీ కాలవ వెంకటలక్ష్మి తనకు న్యాయం చేయాలంటూ నేలపై కూర్చొని ఆందోళనకు దిగారు. రెండ సంవత్సరాల తరువాత తనకు ఎంపిపి అవకాశం ఇస్తామని చెప్పి, ఇవ్వకుండా కాలక్షేపం చేస్తున్నారని ఆరోపించారు. తనకు న్యాయం చేయాలని ఆమె కోరారు. ఆలూరు సాంబశివరెడ్డి జోక్యం చేసుకుని ఆమెతో మాట్లాడారు. ఈ విషయాన్ని పరిశీలిస్తున్నామని చెప్పి ఆమెను బుజ్జగించి ఆదోళన విరమింపజేశారు. అనంతరం మండల సర్వసభ్య సమావేశాన్ని యథావిధిగా కొనసాగించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో తేజొష్ణ, భూ సర్వే డిప్యూటీ తహశీల్దార్ నారాయణస్వామి, జెడ్పీటీసీ భాస్కర్, వైస్ ఎంపిపి రాంగోపాల్, వ్యవసాయ అధికారి శ్యామసుందర్ రెడ్డి, పశు వైద్యాధికారి పెద్దన్న, ఆర్‌డబబ్ల్యూఎస్ ఏఈ జనార్ధన్, ఎంపీటీసీలు దయ్యాలకుంటపల్లి వెంకట శివారెడ్డి పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం : విసి

క్రికెట్ ఆడి క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న విసి రంగజనార్ధన

ప్రజాశక్తి- అనంతపురం

క్రీడలు మానసికోల్లాసానిక దోహదం చేస్తాయని, ప్రతి ఒక్కరూ విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలని జెఎన్‌టియు విసి జింక రంగజనార్ధన తెలిపారు. బుధవారం స్థానిక ఒటిపిఆర్ఐ కళాశాలలో క్రీడా సంబరాలను ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు క్రీడలు ఎంతో దోహదం చేస్తాయని చెప్పారు. విద్యాతో పాటు క్రీడలను భాగస్వామ్యం చేసుకోవాలన్నారు. ఉద్యోగాల ఎంపికలో క్రీడల్లో రాణించిన విద్యార్థులకు ప్రత్యేక కోటా ఉంటుందన్నారు. అనంతపురం ఒటిపిఆర్ఐ కళాశాల అభివద్ధికి జెఎన్‌టియు నుంచి అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు. అంతకుముందు క్రీడాకారుల చేత ఉపకులపతి గౌరవ వందన స్వీకరించి, శాంతి కపోతాలను ఎగురవేశారు. విద్యార్థులతో కలిసి క్రికెట్ ఆడి ఉత్సాహపరిచారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ శశిధర్, ఒటిపిఆర్ఐ డైరెక్టర్ దుర్గాప్రసాద్, ప్రిన్సిపల్ గోపీనాథ్, వర్సిటీ పిఆర్ఒ డాక్టర్ రామ శేఖర్ రెడ్డి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ ప్రభాకర్‌తో పాటు బోధనబోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డుమీద నీరు నిలిచినా పట్టించుకోరా..? : సిపిఎం

ప్రజాశక్తి-ఆత్మకూరు

నిత్యం ప్రజలు రాకపోకలు సాగించే ప్రధాన రహదారిలో నీరు నిలిచినా వాటిని తొలగించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోరాని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ ప్రశ్నించారు. బుధవారం నాడు ఆత్మకూరు పర్యటనకు వచ్చిన ఆయన ప్రధాన రోడ్డుపై ఉన్న నీటిని చూసి, ప్రజలు పడుతున్న ఇబ్బందులను గుర్తించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులతో కలిసి నిలిచిన నీటిలో నాట్లు వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రాంభూపాల్ మాట్లాడుతూ ఆత్మకూరు ప్రధాన రహదారిపై వర్షం వచ్చినప్పుడల్లా మోకాళ్లలోతు నీరు నిలబడుతున్నాయన్నారు. దీంతో ఈ దారిపై రాకపోకలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి వర్షపు నీరును పక్కకు మళ్లించే ఏర్పాట్లు శాశ్వత ప్రాతిపదికన చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు బాలరంగయ్య, ఎస్.నాగేంద్ర కుమార్, కృష్ణమూర్తి, చంద్రశేఖర్‌రెడ్డి, మండల కార్యదర్శి శివశంకర్ పాల్గొన్నారు.

రోడ్డుపై నిలిచిన నీటిలో నాట్లు వేసి నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

విభిన్న ప్రతిభావంతుల్లోనూ విద్యా కుసుమాలు : కలెక్టర్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

విభిన్న ప్రతిభావంతుల్లోనూ విద్యావంతులు ఉన్నారని, వారందరూ డిజిటల్ విద్యా కుసుమాలుగా విరబూయాలని కలెక్టర్ ఎం.గౌతమి ఆకాంక్షించారు. అనంతపురం నగరంలోని పంగల్ రోడ్‌లో ఉన్న ఆర్డీటీ ఇంక్లూసివ్ ఎడ్యుకేషన్‌లో సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సాధారణ విద్యార్థులతో పాటు విభిన్న ప్రతిభావంతులైన విద్యార్థులు ట్యాబ్‌లను ఉపయోగించాలని సూచించారు. ట్యాబ్‌లను అందించడంతోపాటు, వారికి వాటి వినియోగంపై కూడా ప్రత్యేక శిక్షణ అందిస్తున్నట్లు చెప్పారు. ట్యాబ్ ద్వారా మరొకరిపై ఆధారపడకుండా వారే సొంతంగా ఏదైనా నేర్చుకునేలా ప్రభుత్వం అవకాశం కల్పించిందని చెప్పారు. ఇందుకు ఆర్డీటీ, ఇతర స్వచ్ఛంద సంస్థలు సహకారం అందిస్తున్నాయన్నారు. అంగవైకల్యం ఉందని ఎక్కడా బాధపడకుండా మనోధైర్యంతో ఉండాలని సూచించారు. అనంతరం ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌తో అప్లోడ్ చేసిన 187 ట్యాబ్‌లను కలెక్టర్ ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలు, ఉపాధ్యాయులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిఇఒ నాగరాజ్, సమగ్ర శిక్ష ఎపిసి వరప్రసాద్, సిఎంఒ గోపాల్, ఐఇడి కోఆర్డినేటర్ శమ, ఆర్డీటీ ఇంక్లూసివ్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ దశరథ్ పాల్గొన్నారు.

బాబుతోనే ప్రజల భవిష్యత్తుకు గ్యారెంటీ

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడుతోనే ప్రజల భవిష్యత్తుకు గ్యారెంటీ ఉంటుందని టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఆదినారాయణ, జిల్లా అధికార ప్రతినిధి సరిపూటి రమణ అన్నారు. బుధవారం టిడిపి అనంతపురం అర్బన్ నియోజకవర్గం నేతల ఆధ్వర్యంలో నగరంలో పలు డివిజన్‌లలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. పెద్ద ఎత్తున ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించింది. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి రాగానే చేపట్టబోయే పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా క్లస్టర్ ఇన్‌ఛార్జి తలారి ఆదినారాయణ, డిష్ నాగరాజు, సరిపూటి రమణ, మన్సూర్, గోల్ల సుధాకర్ నాయుడు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అధికారంలోకి సూపర్ సిక్స్ పథకాలను ప్రజలందరికీ సంక్షేమ పథకాలను అందిస్తామన్నారు. వచ్చే ఎన్నికల్లో టిడిపిని ప్రజలు ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బంగి నాగ , జేయం భాష, ముక్తియార్, దలవాయి రమాదేవి, శ్రీనివాస్ చౌదరి, రవికుమార్ చౌదరి, సుజాత, మధు, కుమార్, చిరంజీవి, మల్లప్ప, బాలాజీ, వెంకటలక్ష్మి, వరలక్ష్మి, రమణ, రవి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

విద్యాసంస్థల బంద్ విజయవంతం

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రయివేటీకరణ ఉప సంహరించాలని, కడప ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన విద్యాసంస్థల బంద్ విజయవంతమైంది. ప్రభుత్వ, ప్రయివేట్ విద్యా సంస్థలు స్వచ్ఛందంగా బంద్ పాటించడంతో విజయవంతంగా ముగిసింది. బుధవారం విద్యార్థి సంఘాల నేతలు నగరంలో కలియతిరిగి కొన్ని విద్యా సంస్థలను మూసివేయించారు. ఆర్ట్స్ కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, పొట్టి శ్రీరాములు స్కూల్, శారదా స్కూల్, ఎస్ఎస్బిఎన్ పాఠశాల, కళాశాల, జెఎన్టియు, మెడికల్ కళాశాల తదితర సంస్థలకు వెళ్లి బంద్ చేయించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతూరు పరమేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి కుల్లాయిస్వామి, బిసి, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి బిసి.నరేష్, ఐసా జిల్లా కార్యదర్శి ఆలం, పిడిఎస్యు జిల్లా కార్యదర్శి వీరేంద్ర, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి సంతోష్, ఎన్ఎస్యుఐ నరేష్, భగత్సింగ్ యూనియన్ సిద్ధు హాజరై మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం రాష్ట్ర ప్రయోజనాలను కాపాడాలన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రయివేటీకరణ ఉప సంహరించుకోవాలన్నారు. కడప ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలన్నారు. రాష్ట్ర విభజన అంశాలను అమలు చేయాలన్నారు. కేంద్ర సంస్థల్లో ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేయాలన్నారు.

రాయదుర్గం : కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను ఆపాలని కోరుతూ బుధవారం విద్యార్థి, యువజన సంఘాల పిలుపుమేరకు జిల్లా వ్యాప్తంగా చేపట్టిన విద్యాసంస్థల బంద్ విజయవంతమైంది. రాయదుర్గంలో ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్, పిడిఎస్యు, ఎఐవైఎఫ్ ప్రతినిధులు సమ్మెలో పాల్గొన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, ఉపాధ్యక్షులు శివ, భరత్, ఎఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి పి.ఆంజనేయులు, ఎఐవైఎఫ్ నియోజకవర్గ అధ్యక్షుడు కుమార్నాయక్, డిఐవైఎఫ్ కార్యదర్శి అనిల్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఖాళీ పోస్టులు భర్తీ చేయకుండా నిరుద్యోగులను మోసం చేశాయని మండిపడ్డారు. ఉపాధి కల్పిస్తున్న పరిశ్రమలను కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టే యువచనలో ఉన్నాయని ధ్వజమెత్తారు. ఇందులో భాగంగా లక్షలాది మందికి ఉద్యోగ, ఉపాధి కల్పిస్తున్న విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రయివేటీకరణ చేయాలని చూడడం దారుణమన్నారు. కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఊసే లేదన్నారు. రాయలసీమ జిల్లాల్లోని నిరుద్యోగ యువత ఇతర రాష్ట్రాలకు వలస వెళ్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేసి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు ప్రయివేటీకరణను ఆపాలని విశాఖపట్నంలో వామపక్ష విద్యార్థి, యువజన, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు వెయ్యి రోజులకు చేరుకున్న సందర్భంగా ఈ బంద్కు పిలుపునిచ్చామని, ఈ బంద్కు పట్టణంలోని కార్పొరేట్, ప్రయివేట్, ప్రభుత్వ విద్యాసంస్థలు సంపూర్ణంగా మద్దతు తెలిపాయన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు లోకేష్, గౌతమ్, హర్ష, ప్రేమ్, వినయ్, విద్యార్థి సంఘాల నాయకులు మల్లి, అభిషేక్, నవనీత్, పవన్, నాగేంద్ర, నవీన్కుమార్, అరవింద్, లోకేష్, వినయ్, తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ : కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు, విశాఖ ఉక్కు ప్రయివేటీకరణ ఆపాలని డిమాండ్ చేస్తూ పట్టణంలో చేపట్టిన విద్యాసంస్థల బంద్ విజయవంతమైంది. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సిద్ధార్థ్, ఐసా జిల్లా సహాయ కార్యదర్శి రాజశేఖర్, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యుడు చిరంజీవి, నియోజకవర్గ కార్యదర్శి హరున్ రషీద్, టిఎన్ఎస్ఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యుడు సుధాకర్, నియోజకవర్గ అధ్యక్షుడు భరత్, ఆర్ఎస్యూ జిల్లా అధ్యక్షుడు భీమేష్ మాట్లాడుతూ విశాఖ ఉక్కు ప్రయివేటీకరణ ఆపాలని, కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేసి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు హిరణ్య, సతీష్, ఇర్ఫాన్, శర్మాన్, గౌతమ్, తదితరులు పాల్గొన్నారు.

శింగనమల : విశాఖ ఉక్కు ప్రయివేటీకరణను ఉపసంహరించుకోవాలని, కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని కోరుతూ చేపట్టిన విద్యా సంస్థల బంద్ శింగనమలలో విజయవంతమైంది. ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి సూర్యప్రకాశ్, మండల నాయకులు వర్ధన్బాబు మాట్లాడుతూ 32 మంది ప్రాణ త్యాగంతో ఏర్పడిన విశాఖ ఉక్కు ప్రయివేటీకరణను ఆపాలని కార్మికులు, ప్రజా సంఘాలు అనేక రూపాల్లో ఉద్యమాలు చేపట్టాయ న్నారు. వారు ఆందోళనలు చేపట్టి నవంబర్ 8వ తేదీ నాటికి వెయ్యి రోజులవుతున్న సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా విద్యాసంస్థల బంద్ చేపట్టామన్నారు. కార్యక్రమంలో

ఉరవకొండలో నిరసన తెలుపుతున్న విద్యార్థి సంఘం నాయకులు

ప్రదీప్, వెంకి, బాబునాయక్, గౌతమ్, ప్రవీణ్, కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

పెద్దపప్పూరు : వామపక్ష పార్టీలు, విద్యార్థి సంఘాల పిలుపుమేరకు పెద్దపప్పూరులో చేపట్టిన విద్యాసంస్థల బంద్కు ప్రభుత్వ, ప్రయివేట్ విద్యాసంస్థలు సంపూర్ణ మద్దతు తెలిపాయి. సిపిఐ మండల కార్యదర్శి చింతా పురుషోత్తం, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు టి.ఆదినారాయణ మాట్లాడుతూ విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రయివేటీ కరణను ఆపాలని, కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రత్యేక హోదా, విభజన హామీలు నెరవేర్చాలని లేని పక్షంలో ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పెద్దపప్పూరు, జూటూరు కాలేజీ, తిమ్మంచెరువు, గార్లదిన్నె, తదితర గ్రామాల్లో విద్యాసంస్థలు సంపూర్ణంగా బంద్ పాటించాయి. కార్యక్రమంలో ఎపి చేనేత కార్మిక సంఘం మండల అధ్యక్షులు కాశెట్టి నారాయణస్వామి, సిపిఐ మండల సహాయ కార్యదర్శి టి.రామకృష్ణ, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు కమ్మగిరి రాజా, నారాయణస్వామి, సతీష్, ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

గుత్తి : ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్, టిఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పట్టణంలో చేపట్టిన విద్యాసంస్థల బంద్ జయప్రదమైంది. ప్రయివేట పాఠశాలలు, కళాశాలలను స్వచ్ఛందంగా మూసివేశారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలను విద్యార్థి సంఘాల నాయకులు మూసి వేయించారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు సి.రమేష్, ఎఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకట్ నాయక్, టిఎన్ఎస్ఎఫ్ నాయకుడు సురేంద్రబాబు మాట్లాడుతూ కడపలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయాలని, విశాఖ ఉక్కు పరిశ్రమను పరిరక్షించాలని, కేంద్ర విశ్వవిద్యాల యానికి నిధులు కేటాయించాలని, ఉర్దూ విశ్వవిద్యాలయం నిర్మించాలని కోరారు. అనంతరం పట్టణంలోని జడ్పీ బాలిక ఉన్నత పాఠశాలలో కుళ్లిపోయిన కూరగాయలతో వంట చేస్తుండడంతో వాటిని తీసుకెళ్లి జిల్లా ఉప విద్యాధికారికి ఫిర్యాదు చేశారు. అక్కడ నిరసన వ్యక్తం చేశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం వడ్డించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు శ్రీకాంత్, కష్ణ, చిన్న, పెద్ద బాబు, కిరణ్, పవన్ గౌడ్, ఆది, సాయి, నరేష్, అజయ్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బాలుడి మృతి

పెద్దవడుగూరు : మండల పరిధిలోని చిట్టూరు గ్రామానికి చెందిన అభిరామ్కృష్ణ(5) ఐరన్ మాత్రలు మింగి మృతిచెందినట్లు బంధువులు తెలిపారు. వివరాలు.. గ్రామానికి చెందిన రామాంజనేయులు, మునేశ్వరి దంపతులు గత ఆదివారం కూలీ పనులకు వెళ్లారు. ఆ సమయంలో వారి కుమారుడు అభిరామ కృష్ణ ఇంట్లో ఉన్న తీయగా ఉండడంతో 13 ఐరన్ మాత్రలు నమిలి మింగాడు. ఆ తర్వాత అపస్మారకస్థితిలో పడి ఉండగా బంధువులు గమనించి అనంతపురం ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించడంతో కర్నూలుకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. తల్లి మునేశ్వరి ఆరోగ్యం నిమిత్తం ఆసుపత్రిలో ఇచ్చిన ఐరన్ మాత్రలు ఇంట్లో ఉంచుకోగా అవే బాలుడి మృతికి కారణమైనట్లు తెలిసింది.

ఆటో డ్రైవర్ ఆత్మహత్యాయత్నం

గుత్తి : మండల పరిధిలోని బసినేపల్లి గ్రామంలో బుధవారం ఆటో డ్రైవర్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన పులికొండ రంగ ఆటో నడుపుకుంటూ జీవనం కొనసాగించేవాడు. అనారోగ్యం, ఆర్థిక సమస్యలతో అతడు ఇంట్లో ఎవరు లేని సమయంలో పురుగుల మందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించగా మెరుగైన చికిత్స కోసం అనంతపురం తరలించారు. సంఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

పెచ్చులు పడి కార్మికుడికి గాయాలు

గుత్తి : మండల పరిధిలోని బేతాపల్లి గ్రామంలో బుధవారం నిర్మాణంలో ఉన్న ఆలయంలో పై పెచ్చులు ఊడిపడి ఓ కార్మికుడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల వివరాల మేరకు.. గ్రామంలో శివాలయం నిర్మాణం చేపట్టగా అందులో పని చేస్తున్న భవన నిర్మాణ కార్మికుడు నారాయణపై పెచ్చులు ఊడి పడడంతో తీవ్రంగా గాయపడగా స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు అనంతపురం తీసుకెళ్లారు.

కేంద్రీయ విద్యాలయంలో లైబ్రేరియన్పై వేటు

అనంతపురం : ఎస్కే యూనివర్సిటీ సమీపంలోని కేంద్రీయ విద్యాలయంలో విద్యార్థుల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన లైబ్రేరియన్ భానుప్రకాష్నాయక్ను సస్పెండ్ చేస్తూ ఉన్నతాధికారులు బుధవారం చర్యలు తీసుకున్నారు. కొద్దిరోజుల క్రితం సెంట్రల్ స్కూల్లో విద్యార్థుల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన తీరుపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. విచారణలో విద్యార్థుల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన తీరు నిజమేనని నిర్ధారణ కావడంతో ఉన్నతాధికారులు భానుప్రకాష్నాయక్ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠినమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు హామీ ఇచ్చారు.

మహిళా సంఘాల్లో డబ్బు స్వాహాపై ఫిర్యాదు

గార్లదిన్నె : మండల పరిధిలోని పెనకచర్ల డ్యాం గ్రామంలో బిస్మిల్లా దస్తగిరి, నిర్మల మహిళా సంఘాల సభ్యులు చెల్లించిన డబ్బులను బ్యాంకులో జమ చేయకుండా అక్కడ పనిచేస్తున్న బుక్ కీపర్ సొంతఖర్చులకు వాడుకొందని బుధవారం ఆయా సంఘాల సభ్యులు స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఆ రెండు గ్రూపులకు సంబంధించి రూ. 12 లక్షలు కాజేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. కాజేసిన మొత్తాన్ని చెల్లించమని అడిగితే కుటుంబ సభ్యులతో కలిసి బెదిరిస్తున్నట్లు వారు వాపోయారు. ఎపిఎం శ్రీరాములును వివరణ కోరగా గ్రామంలో గ్రూపుల వారీగా విచారిస్తున్నామని, రెండు మూడు రోజుల్లో అన్ని విషయాలను తెలియజేస్తామని తెలిపారు.

రైతాంగాన్ని నట్టేట ముంచిన సిఎం జగన్

జనసేన జిల్లా అధ్యక్షులు టిసి వరుణ్

ప్రజాశక్తి-అనంతపురం

సిఎం జగన్ రైతాంగాన్ని నట్టేట ముంచారని జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు టిసి వరుణ్ బుధవారం ఓ ప్రకటనలో విమర్శించారు. సిఎం పుట్టపర్తి పర్యటన ఉమ్మడి అనంతపురం జిల్లా అన్నదాతల్లో ఆశలు నింపలేకపో యిందన్నారు. వైసిపి ప్రభుత్వం రైతులను ఏ విషయంలో ఆదుకుందని ప్రశ్నించారు. 9 గంటల నాణ్యమైన నిరంతర విద్యుత్ ఇస్తున్నారా, ఉద్యానవన రైతులను ఆదుకునే ప్రయత్నం చేశారా, సబ్సిడీపై స్ప్రింక్లర్లు, డ్రిప్పులు మంజూరు చేశారా, కరువు సహాయక చర్యలు చేపట్టారా, కౌలు రైతులను ఆదుకున్నారా అని నిలదీశారు. రైతుల ఆత్మహత్యల పట్ల వేదన, అన్నదాతల సమస్యల పట్ల అవగాహన వాటి పరిష్కారంపై చిత్తశుద్ధి కలిగిన పవన్ కళ్యాణ్ ద్వారానే ఎపిలో వ్యవసాయ రంగం గాడిన పడుతుందని, జనసేనను ఆదరించాలని కోరారు.

నేడు 'తాహా' షోరూం ప్రారంభం

గుత్తి : సుదీర్ఘకాలంగా ఫ్యామిలీ బ్యూటీ సెలూన్ రంగంలో ప్రజల ఆదరణ పొందుతున్న తాహా బ్యూటీ ట్రెండ్స్ ఫ్యామిలీ సెలూన్ రెండో బ్రాంచ్ను గురువారం(నేడు) పట్టణంలోని అనంతపురం రోడ్డులో ప్రారంభిస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ మాలి తెలిపారు. పట్టణంలో బుధవారం ఆయన మాట్లాడుతూ గత్తిలో ప్రొప్రైటర్ చాంద్బాషా పర్యవేక్షణలో తాహా సేవలను అందిస్తున్నట్లు తెలిపారు. త్వరలో ధర్మవరం, మరిన్ని ప్రాంతాల్లో తాహా ప్రజల ముందుకు రానుందని తెలిపారు. గుత్తి షోరూంను ఎమ్మెల్యేలు వై.వెంకట్రామి రెడ్డి, కె.పెద్దారెడ్డి, గుంతకల్లు మున్సిపల్ వైస్ఛైర్పర్సన్ నైరుతిరెడ్డి లాంఛనంగా ప్రారంభిస్తారని తెలిపారు.

సినిమా థియేటర్లలో తనిఖీలు

అనంతపురం : లీగల్ మెట్రాలజీ డిపార్టుమెంట్ అధికారులు బుధవారం నగరంలోని సినిమా థియేటర్లలో తనిఖీలు నిర్వహించారు. ఇందులో భాగంగా క్యాంటిన్లలో ఏర్పాటు చేసిన బోర్డులో కనబరచిన తినుబండారాలు, శీతల పానీయాలను పరిశీలించారు. వాటి కొలతల్లో తేడా ఉండడం గమనించి గంగ సినీ థియేటర్లో 4 కేసులు, ఎస్వీ థియేటర్లో 2 కేసులు నమోదు చేసి రూ. 1.2 లక్షల జరిమానా విధించినట్లు అసిస్టెంట్ కంట్రోలర్ సుధాకర్ తెలిపారు.

వైసిపిలో పలువురు చేరిక

శింగనమల : మండల పరిధిలోని గురుగుంట్ల గ్రామానికి చెందిన టిడిపి నాయకులు వేరేసి వెంకటేష్, వేరేసి నాగలింగం బుధవారం వైసిపిలో చేరారు. వారికి రాష్ట్ర ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివరెడ్డి పార్టీ కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం సాంబశివారెడ్డి స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో డ్రైనేజీ కాలువను పరిశీలించి త్వరితగతిగా పనులను ప్రారంభించాలన్నారు. కార్యక్రమంలో ఎంపిపి యోగేశ్వరి, మండల కన్వీనర్ పట్నం నాగేష్, డిసిఎంఎస్ డైరెక్టర్ బొమ్మన శ్రీరాంరెడ్డి, నాయకులు కొండయ్య, మల్లికార్జునరెడ్డి, నాగవర్ధన్రెడ్డి, వెంకటనారాయణ, లక్ష్మీనారాయణ రెడ్డి, శివ, నారాయణ కార్యకర్తలు పాల్గొన్నారు.

జాతీయ హాకీ పోటీలకు బి.అభిషేక్

ఉరవకొండ : హాకీ పోటీల్లో విడపనకల్లు మండల పరిధిలోని పాల్తూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థి బి.అభిషేక్ అత్యంత ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి హాకీ జట్టుకు ఎంపికైనట్లు హెచ్ఎం సర్వమంగళ, ఫిజికల్ డైరెక్టర్ శ్రీనివాసులు తెలిపారు. వారు మాట్లాడుతూ ఇటీవల అనకాపల్లి జిల్లాలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-17 బాలుర విభాగంలో జరిగిన రాష్ట్ర స్థాయి హాకీ పోటీల్లో జిల్లా బాలుర జట్టు తృతీయ, బాలికల జట్టు ద్వితీయ స్థానాల్లో విజయం సాధించాయన్నారు. వచ్చే నెల మధ్యప్రదేశ్లో జరిగే జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో ఎపి జట్టు తరపున పాల్గొంటారని తెలిపారు.

జాతీయ జట్టుకు ఎంపికైన అభిషేక్

'వై ఎపి నీడ్స్ జగన్'ను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-అనంతపురం

'వై ఎపి నీడ్స్ జగన్' కార్యక్రమంలో భాగంగా ఈ నెల 9వ తేదీ నుంచి వైసిపి ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం నుంచి ఆయా కుటుంబాలు పొందిన లబ్ధిని వివరించాలని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. నగరంలోని వైసిపి కార్యాలయంలో బుధవారం జిల్లా అధ్యక్షుడు పైలా నరసిం హయ్య, ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్రెడ్డి, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి, ఎడిసిసి బ్యాంక్ ఛైర్పర్సన్ కవిత, ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డిలతో కలిసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. విప్ మాట్లాడుతూ నాలుగేళ్లలో రాష్ట్ర వ్యాప్తంగా రూ. 2.4 లక్షల కోట్లను నగదు బదిలీ ద్వారా లబ్ధిదారుల కుటుంబాలకు అందించామన్నారు. ఎన్నికల హామీలు 90 శాతం అమలు చేశామన్నారు. టిడిపి హయంలో చేసిందేమీ లేదని విమర్శించారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైసిపి జిల్లా నాయకులు

అనంతపురం కార్పొరేషన్ : రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పాలన కొనసాగాలంటే వైఎస్ జగన్మోహన్రెడ్డిని మరోమారు సిఎం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని నగర మేయర్ మహమ్మద్ వసీం పేర్కొన్నారు. నగర పాలక సంస్థ కార్యాలయంలోని తన ఛాంబర్లో బుధవారం ఆయన డిప్యూటీ మేయర్లు వాసంతి, విజయభాస్కర్రెడ్డి, కార్పొరేటర్లతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ముందుగా 'ఎపికి జగనే ఎందుకు కావాలి' బ్రోచర్లను విడుదల చేశారు. మేయర్ మాట్లాడుతూ నాలుగున్నరేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పాలన గురించి ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. నగరంలో తొలి విడతలో 20 సచివాలయాల పరిధిలో గురువారం నుంచి కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. టిడిపి పాలనలో ఎంపి, ఎమ్మెల్యే, మేయర్ వర్గాలుగా విడిపోయి నగర అభివృద్ధిని పూర్తిగా విస్మరించగా, తమ పాలకవర్గం సమిష్టిగా పనిచేస్తూ నగర అభివృద్ధికి తోడ్పాటుగా నిలుస్తోందన్నారు. సమావేశంలో కార్పొరేటర్లు సైపుల్లా, అనిల్కుమార్రెడ్డి, ఇషాక్, శ్రీనివాసులు, రహంతుల్లా, బాబాఫకృద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ : 'వై ఎపి నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని నియోజకవర్గంలో జయప్రదం చేయాలని వైసిపి ఇన్ఛార్జి వై.విశ్వేశ్వరరెడ్డి ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. అధికారులు, పార్టీ శ్రేణులు ప్రతి గ్రామంలో ప్రతి ఇంటికీ వెళ్లి వైసిపి ప్రభుత్వంలో చేసిన మేలు, అభివృద్ధి గురించి తెలియజేయాలన్నారు. ఎవరికైనా ఏదైనా సంక్షేమ పథకం అందకపోతే అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. గత ప్రభుత్వానికి, జగన్ ప్రభుత్వానికి ఉన్న తేడాను వివరించాలన్నారు.

బుక్కరాయసముద్రం : నియోజకవర్గ వ్యాప్తంగా నేటి నుంచి 'వై ఎపి నీడ్స్ జగన్' కార్యక్రమం ప్రారంభమవుతుందని రాష్ట్ర ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి తెలిపారు. బుక్కరాయసముద్రం, శింగన మల మండలాల ఎంపిపి కార్యాలయాల్లో 'వై ఎపి నీడ్స్ జగన్' కార్యక్రమంపై ప్రజాప్రతినిధులు, వైసిపి శ్రేణులతో సమావేశం నిర్వహించారు. ఆలూరు సాంబశివారెడ్డి మాట్లాడుతూ గురువారం మండల పరిధిలోని నీలంపల్లి, నార్పల మండలంలోని బండ్లపల్లి, గార్లదిన్నె మండలంలోని కేశవాపురం, పుట్లూరు మండలంలోని సి.వెంగన్న పల్లి, యల్లనూరు మండలంలోని 85 నిట్టూరు పరిధిలోని గ్రామాల్లో 'వై ఎపి నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు.

అవినీతి రహిత సమాజాన్ని స్థాపించాలి

యువతకు విజిలెన్స్ ఎస్పీ మునిరామయ్య పిలుపు

ప్రజాశక్తి-అనంతపురం

అవినీతి రహిత సమాజ స్థాపనకు యువత కృషి చేయాలని జిల్లా విజిలెన్స్ ఎస్పీ ఎం.మునిరామయ్య పిలుపునిచ్చారు. ప్రగతి పథం యూత్ అసోసియేషన్, ఎస్ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం నగరంలోని నెహ్రూ యువ కేంద్రం మీటింగ్ హాలులో విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు నిర్వహిం చారు. ముఖ్య అతిథులుగా విజిలెన్స్ ఎస్పీతో పాటు నెహ్రూ యువ కేంద్రం ప్రోగ్రామ్ ఇన్ఛార్జి జి.శ్రీనివాసులు, ఐక్యరాజ్యసమితి అవార్డు గ్రహీత బిసాటి భరత్, రాష్ట్రపతి అవార్డు గ్రహీత బిసాటి జీవన్కుమార్, అనంతపురం అర్బన్ బ్యాంక్ డైరక్టర్ సుంకర రమేష్, కాపు సేన అధ్యక్షులు పేరూరు శ్రీను హాజరై స్వామి వివేకానంద చిత్రపటానికి పూలామాల వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. మునిరామయ్య మాట్లాడుతూ సమాజంలో అవినీతి జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. విజిలెన్స్ టోల్ ఫ్రీ నంబర్ 14400పై అవగాహన పెంచుకోవాలన్నారు. అనంతరం అవినీతి నిర్మూలనపై వక్తృత్వ, క్విజ్ పోటీలు నిర్వహించి ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి మెడల్స్, ప్రశంసా పత్రాలు ప్రదానం చేశారు. చివరగా యువత, అధికారులు అవినీతి నిర్మూలనపై ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ప్రగతి పథం యూత్ అసోసియేషన్ సభ్యులు వై.పవన్, తుకారాం నాయక్, గణేష్, శీను, భరత్సాయి, ఎస్ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ సభ్యులు నందిత, యువతీ యువకులు పాల్గొన్నారు.

ప్రశంసాపత్రం అందజేస్తున్న విజిలెన్స్ ఎస్పీ మునిరామయ్య

15 రోజుల్లో జీతాలు ఇవ్వకపోతే సమ్మె

ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్

గన్నెవారిపల్లి గ్రామ పంచాయతీ, స్వచ్ఛభారత్ కార్మికులకు 15రోజుల్లోపు బకాయి వేతనాలు చెల్లించక పోతే సమ్మె చేపడతామని సిఐటియు నాయకులు హెచ్చరించారు. కార్మికుల సమస్యలపై బుధవారం సిఐటియు ఆధ్వర్యంలో ఎంపిడిఒ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. అంతకు ముందు సిఐటియు నాయకులు, కార్మికులు స్థానిక పప్పూరు రోడ్డు సర్కిల్ నుంచి ర్యాలీగా ఎంపిడిఒ కార్యాలయం చేరుకుని ధర్నా నిర్వహించారు. సిఐటియు నాయకులు మాట్లాడుతూ కరోనా సమయంలో కార్మికులను దేవళ్లు, కరుణామయులని కొనియాడిన ప్రభుత్వ పెద్దలు నేడు వారి గోడును వినడం లేదన్నారు. తక్షణమే బకాయి వేతనాలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, పనిముట్లు, పరికరాలు అందించాలని కోరారు. అనంతరం ఎంపిడిఒ రంగా రావుకు వినతిపత్రం అందజేశారు. ఎంపిడిఒ స్పందిస్తూ ఉన్నతాధికారులతో చర్చించి కార్మికులకు వేతనాలు అందేలా చర్యలు చేపడతామని, పనిముట్లు, పరికరాలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జగన్మోహన్రెడ్డి, హనుమంతరెడ్డి, రామాంజి, పంచాయతీ కార్మికులు రాజు, సంధ్యాబాయి, రంగా, రాజ్కుళ్లాయప్ప, హనుమంతు, సదానంద, రామకృష్ణ, శ్రీరాములు, నాగరాజు, నరసింహమూర్తి, శంకర్, జుబేర్, రామ్మోహన్, పాల్గొన్నారు.

ఎంపిడిఒ కార్యాలయంలో బైఠాయించిన సిఐటియు నాయకులు

తాగునీటి సమస్య రాకుండా చూడండి

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

మండల వ్యాప్తంగా తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని సభ్యులు అధికారులను కోరారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో బుధవారం ఎంపిపి శ్రీదేవి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిం చారు. ఆర్డబ్ల్యుఎస్ ఇన్ఛార్జి ఇంజినీర్ దేవకుమార్ మాట్లాడుతూ జెసి నాగిరెడ్డి తాగునీటి పథకం ద్వారా మండలంలో తాగునీటి సమస్యకు పరిష్కారం చూపామని చెబుతుండగా తెలికి, మేడిమాకుల పల్లిలో ఆ పథకం లేదని ముందు ఇక్కడ తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎంపిటిసి రామన్న ప్రశ్నించారు. గృహ నిర్మాణశాఖ పరిధిలో 1,285 ఇళ్ల నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపామని ఎఇ నెట్టికంటయ్య వివరించగా ఇళ్లు ఎప్పుడొస్తాయి. ఎన్నికలు దగ్గరలోనే ఉన్నందున బిల్లులు కావని కాశేపల్లి సర్పంచి కృష్ణారెడ్డి అభ్యంతరం తెలుపుగా మంజూరయ్యేలా కృషి చేస్తామని అధికారులు తెలిపారు. అనంతరం రెవెన్యూ, వ్యవసాయం, పశు సంవర్ధక, వైద్య, ఆరోగ్యం, విద్యుత్, స్త్రీ సంక్షేమం, పలు శాఖల అధికారులు ఆయా శాఖల ప్రగతిని తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దార్ నాగభూషణం, ఎంపిడిఒ కుళ్లాయిస్వామి, ఎఒ మల్లేశ్వరి, వైద్యుడు శ్రీనివాసబాబు, ఐసిడిఎస్ సూపర్వైజర్ వెంకటలక్ష్మి, ఎపిఒ పుల్లారెడ్డి, పలువురు పాల్గొన్నారు.

మండల సమావేశంలో మాట్లాడుతున్న వైద్యులు శ్రీనివాసులుబాబు

క్లాప్ ఆటో డ్రైవర్ల దీక్షలకు సిఐటియు మద్దతు

గుంతకల్లు : తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ఐదు రోజులుగా క్లాప్ ఆటో డ్రైవర్లు చేస్తున్న సామూహిక నిరాహార దీక్షలకు బుధవారం సిఐటియు నాయకులు మద్దతు తెలిపారు. సిఐటియు పట్టణ ప్రధాన కార్యదర్శి సాకే నాగరాజు మాట్లాడుతూ క్లాప్ ఆటో డ్రైవర్లు బకాయి వేతనాలు, ఇతర డిమాండ్లపై దీక్ష చేస్తున్నా పాలకులు, అధికారులు స్పందించకపోవడం సరైంది కాదన్నారు. వారు దీక్షలు చేపట్టడంతో పట్టణంలో చెత్త అక్కడే ఉండిపోయి దుర్గంధంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. తక్షణమే క్లాప్ ఆటో డ్రైవర్ల డిమాండ్లను అధికారులు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు షేక్ షబ్బీర్, బాషా, మోహన్కుమార్, సాయి, విక్రమ్ పాల్గొన్నారు.

దీక్షలో పాల్గొన్న క్లాప్ ఆటో డ్రైవర్లు

నేటి నుంచి ఇంటింటి చెత్త సేకరణ బంద్

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

ఏళ్ల గడుస్తున్నా పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కారం కాకపోవడంతో గురువారం(నేడు) నుంచి నగరంలో ఇంటింటి చెత్త సేకరణను నిలిపివేస్తున్నట్లు మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం స్పష్టం చేసింది. నగర మేయర్ మహమ్మద్ వసీం బుధవారం తన ఛాంబర్లో కమిషనర్ భాగ్యలక్ష్మి, అదనపు కమిషనర్ రమణారెడ్డి, కార్మిక సంఘం ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. మున్సిపల్ ఉద్యోగ, కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు, సిఐటియు నగర కార్యదర్శులు వెంకటనారాయణ, ముత్తుజ మాట్లాడుతూ అక్టోబర్ 22వ తేదీ నగరపాలక సంస్థ పాలకవర్గం, మేయర్, డిప్యూటీ మేయర్లు, ఇన్ఛార్జి కమిషనర్ సమక్షంలో కార్మికుల సమస్యల పై చర్చించగా 15 రోజుల్లోపు పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇచ్చారే కానీ నేటికీ పరిష్కరించలేదన్నారు. దీంతో ఈ నెల 19, 20 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా కలెక్టర్ కార్యాలయాల వద్ద వంటావార్పు కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. ఆ రోజు నుంచి మెరుపు సమ్మె చేస్తామని మేయర్ వసీంకు సిఐటియు ఆధ్వర్యంలో సమ్మె నోటీసు అందజేశారు. సమావేశంలో సంఘం నగర అధ్యక్ష, కార్యదర్శులు బండారి స్వామి, తిరుమలేష్, ఉపాధ్యక్షులు శశాంద్రకుమార్, ముత్తురాజు, ఎం.నల్లప్ప, మహిళా కన్వీనర్ వరలక్ష్మి, శ్రీనివాస్మూర్తి, ఎం.ఆది, మరియమ్మ, వెంకటేశులు, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' పని దినాలను పెంచాలి

నార్పల : ఉపాధి హామీ చట్టంలో పని దినాలను మరో వంద రోజులు పెంచాలని కోరుతూ బుధవారం నార్పలలో 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమానికి హాజరైన కలెక్టర్ గౌతమికి రైతు సంఘం ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ జిల్లాలో తీవ్రమైన కరువు పరిస్థితులు ఏర్పడ్డాయని, కావున ఉపాధి పని దినాలను మరో వంద రోజులు పెంచి, వేతనం రూ. 600 కల్పించాలని కలెక్టర్ను కోరారు.

గ్రంథాలయం తనిఖీ

నార్పల : స్థానిక శాఖా గ్రంథాలయాన్ని బుధవారం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రమ సందర్శించి రికార్డులను పరిశీలించారు. సిబ్బందిని పలు సూచనలు చేశారు. గ్రంథాలయ సెస్సు వసూలుకు కృషి చేయాలని ఆదేశించారు. ఆమె వెంట గ్రంథాలయ అధికారిణి కె.జీవన పాల్గొన్నారు.

'ఉయ్యాలవాడ' విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ

ప్రజాశక్తి-అనంతపురం

ప్రథమ స్వాతంత్ర్య సమరయోధులు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహ ఏర్పాటుకు బుధవారం నగరం లోని ఆర్ట్స్ కళాశాల సమీపంలో ముఖ్య అతిథి డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్రెడ్డి భూమిపూజ చేశారు. కోగటం మాట్లాడుతూ దేశం, సమాజం కోసం కృషి చేసిన మహనీయులను గుర్తించుకోవడం అందరి బాధ్యత అన్నారు. అందులో భాగంగానే ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహం ఏర్పాటుకు ఆంధ్రప్రదేశ్ రెడ్డి సంఘం ముందుకురావడం శుభపరిణామం అన్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గంగుల కుంట నరేష్కుమార్ రెడ్డి, గౌరవాధ్యక్షుడు గట్టిరెడ్డి భయపరెడ్డి మాట్లాడుతూ ఉయ్యాలవాడ నరసింహారెడ్డి చరిత్ర తెలిపేలా 14 అడుగుల కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేసి జనవరి 7వ తేదీ ఆవిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాటిల్ రామకృష్ణారెడ్డి, అనంతపురం రెడ్డి సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి గణేశం ముత్యాలరెడ్డి, కార్యదర్శి బిఎస్ఎన్ఎల్ రాజశేఖర్రెడ్డి, జిల్లా నాయకులు రేనాటి నాగేశ్వరరెడ్డి, కృష్ణారెడ్డి, ఇంజినీర్ శ్రీనివాసరెడ్డి, అన్నపూర్ణ హోటల్ లక్ష్మిరెడ్డి, టివి.రెడ్డి, రమేష్రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

భూమిపూజ చేస్తున్న రెడ్డి సంఘం నాయకులు

సచివాలయ భవనం ప్రారంభం

పుట్లూరు : సిఎం జగన్ ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన గ్రామ సచివాలయాలు ప్రజల సంక్షేమానికి నిలయాలుగా మారాయని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి పేర్కొన్నారు. మండల పరిధిలోని అరికటవేముల గ్రామంలో బుధవారం ఆమె సచివాలయ నూతన భవనాన్ని ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ సిఎం జగన్ గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా రాష్ట్రంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చార న్నారు. టిడిపి పాలనలో గ్రామాల్లో ప్రజలకు పనులు కావాలి అంటే ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేదని, వైసిపి పాలనలో సచివాలయ వ్యవస్థ ద్వారా ఇంటి దగ్గరికే సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపిపి రాఘవరెడ్డి, ఎంపిడిఒ యోగానందరెడ్డి, తహశీల్దార్ మోహన్కుమార్, మండల అధికారులు, ప్రజాప్రతినిధులు, మండల నాయకులు, సచివాలయం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే పద్మావతి

ఆర్టిఒ కార్యాలయ నిర్మాణ పనుల పరిశీలన

తాడిపత్రి : తాడిపత్రిలో దాతల సహకారంతో నూతనంగా నిర్మిస్తున్న ఆర్టిఒ కార్యాలయ బిల్డింగ్ పనుల ను బుధవారం ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పరిశీలించారు. బిల్డింగ్ నిర్మాణానికి స్వచ్ఛంధంగా సహాయ సహకారా లు అందిస్తున్న పరిశ్రమల, ట్రాన్స్పోర్ట్ యాజమాన్యాలను, నిర్మాణానికి అయ్యే కూలీల ఖర్చు మొత్తాన్ని భరిస్తున్న టిఎన్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ తిప్పిరెడ్డి నాగార్జునరెడ్డిని ఎమ్మెల్యే అభినందించారు. డిసెంబర్ లోపు ఆర్టిఒ కార్యాలయ నిర్మాణ పనులను పూర్తి చేయాలని రవాణా శాఖ అధికారులకు సూచించారు. ఎమ్మెల్యే వెంట తిప్పిరెడ్డి నాగార్జునరెడ్డి, పెద్దపప్పూరు మండల కన్వీనర్ అమర్నాథ్రెడ్డి, తదితరులు ఉన్నారు.

నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పెద్దారెడ్డి

కనకదాసు విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ

ఆత్మకూరు : కురుబల ఆరాధ్యదైవం కనకదాసు విగ్రహ ఏర్పాటుకు ఆత్మకూరులో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్రెడ్డి భూమిపూజ చేశారు. సిఎం జగన్ రైతుల బ్యాంకు ఖాతాల్లో రైతు భరోసా నగదు' జమ చేసిన సందర్భంగా బుధవారం ఆత్మకూరులో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా రైతులు ముందుగా ఎమ్మెల్యే జడ్పి ఛైర్పర్సన్ బోయ గిరిజమ్మ, విశ్రాంత జడ్జి, బిసి అధ్యయన కమిటీ మెంబర్ కురుబ క్రిష్టప్పతో కలిసి కేక్ కట్ చేయించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతు కుటుంబాల్లో ముందుగానే దీపావళి పండుగ వచ్చిందని తెలిపారు.



కనకదాసు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్రెడ్డి, జడ్పి ఛైర్పర్సన్ గిరిజమ్మ